సాక్షి
అనంతపురం
మంగళవారం ၊ 9 ၊ జనవరి ၊ 2024



నేడు 15 చోట్ల ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలో 15 చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో సోమవారం టమాట కిలో గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
28.4°/18.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. పగలంతా ఆకాశం మేఘావృతమైంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

11 నుంచి గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. గతేడాది డిసెంబర్‌లో గ్యాస్ట్రో ఎంటలరాలజీ విభాగానికి ప్రభుత్వం వైద్యులను నియమించింది. పలువురు వైద్యులు విధుల్లోకి చేరారు. గురువారం నుంచి సేవలు ప్రారంభమవుతాయని బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి సోమ, గురువారం గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రతి సోమ, గురువారాల్లో న్యూరో, మంగళ, శుక్రవారాల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, బుధ, శనివారాల్లో మెడికల్ గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ ఓపీ సేవలు అందుతున్నాయని వివరించారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ విజయవాడలో మంగళ, బుధవారాల్లో కలెక్టర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనుంది. మంగళవారం కలెక్టర్లతో జరగనున్న సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం బయలుదేరి వెళ్లారు. బుధవారం రాజకీయ పార్టీలతో జరగనున్న సమావేశంలో కలెక్టర్లు పాల్గొన్నాల్సి వస్తే అక్కడే ఉండి 11వ తేదీన తిరిగి అనంతపురం వస్తారు. లేదంటే 10వ తేదీనే జిల్లాకు వస్తారు.

కప్పేసిన పొగమంచు

- శీతలగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి



అనంతపురం అగ్రికల్చర్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా వాతావరణం మారింది. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగలంతా ఆకాశం మేఘావృతమైంది. భానుడు కనిపించకుండా పొగమంచు పూర్తిగా కప్పేసింది. శీతల గాలులు, చలితీవ్రత వల్ల జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 26 నుంచి 29 డిగ్రీల లోపు పతనం కాగా.. రాత్రి ఉష్ణోగ్రతలు 17 నుంచి 22 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరగడం, ఆకాశం మేఘావృతం కావడంతో రాత్రింబవళ్లు చలి వాతావరణం నెలకొంది. కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, ఎన్‌పీకుంట, తలుపుల, అమడగూరు, లేపాక్షి, కదిరి, తనకల్లు, గాండ్లపెంట తదితర మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. కాగా మంగళవారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తప్పకుండా పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు సూచించారు. ముఖ్యంగా ఎక్కడైనా ప్రత్యేక తరగతుల పేరుతో స్కూళ్లు నడిపితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 19న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

పకడ్బందీగా 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహించాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' మండలస్థాయి క్రీడా పోటీలు ఈ నెల 10 నుంచి పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహణపై జేసీ సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. క్రీడా పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మ్యాచ్ షెడ్యూల్ తయారు చేసి క్రీడాకారులకు సమాచారం చేరవేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే యజ్ఞం

భూ వివాదాలు... భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద జిల్లాలో రీ-సర్వే ప్రక్రియ యజ్ఞంలా సాగుతోంది. మూడు రెవెన్యూ డివిజన్లలోని 31 మండలాల పరిధిలో గల 503 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇప్పటికి మూడు విడతల్లో 200 గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. అదే విధంగా స్వామిత్వ పథకం కింద ఇప్పటి వరకు 18 గ్రామాల్లోని గ్రామ కంఠంలోని నివాసాల సర్వే పూర్తి చేశారు.



సర్వే అనంతరం హద్దుల గుర్తింపును పరిశీలిస్తున్న సర్వేశాఖ ఏడీ రూప్లానాయక్

- 3 విడతల్లో 200 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి
- 1,82,774 భూకమతం పటాలు తయారు
- 5.88 లక్షల ఎకరాల్లో సమగ్ర సర్వే
- 1.61 లక్షల హద్దురాళ్లు ఏర్పాటు
- 61,425 భూహక్కు పత్రాల పంపిణీ
- 4వ విడత కింద 120 గ్రామాల్లో సర్వే ప్రారంభం
- స్వామిత్వ కింద 18 గ్రామాల్లో గ్రామ కంఠం సర్వే పూర్తి

అనంతపురం అర్బన్: జిల్లాలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద అధికారులు రీ-సర్వే ప్రక్రియ ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఆధునిక పరికరాలతో సర్వే చేపట్టారు. మూడు సీఓఆర్ఎస్ (క్రాస్ ఆర్జిన్ రిసోర్స్ షేరింగ్) బేస్ స్టేషన్లు, 152 రోవర్లు, 41 ల్యాప్‌లాప్‌లు, 40 కంప్యూటర్లతో కూడిన డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను ఉపయోగిస్తున్నారు. రీ-సర్వే కోసం గ్రామస్థాయిలో 464 మంది సర్వేయర్లు, 501 మంది గ్రామ రెవెన్యూ అధికారులు, మండలస్థాయిలో 35 మంది సర్వేయర్లు, 31 మంది రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ల సేవలను వినియోగించుకుంటున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణ

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ నేతృత్వంలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ అధికారుల పర్యవేక్షణలో సర్వే ప్రక్రియ పకడ్బందీగా సాగుతోంది. ఇక అధునిక రీ-సర్వే రికార్డుల నాణ్యతను జిల్లాస్థాయిలో కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, సర్వే భూ రికార్డుల శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారు.

రీ-సర్వే ఇలా...

- జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 503 గ్రామాల్లో సర్వే చేయనున్న 25,17,655.42 ఎకరాల వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో డ్రోన్ ఫ్లై, హెలికాప్టర్ ఫ్లై పూర్తయింది.
- ఇప్పటి వరకు 474 గ్రామాల డ్రోన్ చిత్రాలు (ఓఆర్ఐ-ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) వచ్చాయి. ఇక 200 గ్రామాల్లో 5,88,564.40 ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. వీటికి సంబంధించి 1,82,774 ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) తయారు చేశారు. సర్వే పూర్తయిన 200 గ్రామాల్లో 181 గ్రామాలకు సంబంధించి తుది ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) పూర్తయ్యింది.
- సర్వే పూర్తయిన 200 గ్రామాల్లో ఇప్పటి వరకు 110 గ్రామాల్లో 1,61,803 హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.
- ఇప్పటి వరకు 120 గ్రామాలకు సంబంధించి 61,425 భూహక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు.

స్వామిత్వ కింద సర్వే..

జిల్లాలో 577 గ్రామ పంచాయతీల్లోని గ్రామ కంఠాల్లో 1,063 గ్రామ నివాసాలు ఉన్నాయి. వీటిని స్వామిత్వ పథకం కింద సర్వే చేస్తున్నారు. అన్ని గ్రామ నివాసాల్లో డ్రోన్ ఫ్లై పూర్తయ్యింది. ఇప్పటి వరకు 41 గ్రామాల్లోని నివాస ప్రాంత ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) తీసుకున్నారు. అదే విధంగా ఈ 41 గ్రామాల్లో జీటీ (గ్రౌండ్ ట్రూతింగ్) పూర్తయ్యింది. 19 గ్రామాల్లో జీవీ (గ్రౌండ్ వ్యాలిడేషన్) పూర్తయ్యింది. మిగిలిన 22 గ్రామాల్లో ప్రక్రియ వేగవంతం చేశారు. 18 గ్రామాల్లోని నివాస ప్రాంతాలకు సంబంధించి 365.30 ఎకరాలు సర్వే చేశారు. 10,031 పీపీఎం (ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్) తయారు చేశారు. ఈ గ్రామాల్లో 13 నోటిఫికేషన్ ఇచ్చారు. 17 గ్రామాలకు తుది ఆర్ఓఆర్ పూర్తి చేశారు.

భూ హక్కుపత్రం ఇచ్చారు



నాకు వెంకటాంపల్లి గ్రామ పొలం సర్వే నంబర్లు 165-బి, 231-బి, 73, 95-బి,98లో మొత్తం 7.98 ఎకరాలు భూమి ఉంది. ఇందుకు సంబంధించి రీ-సర్వే పక్కాగా నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా భూ హక్కు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారు.

– డి.తిమ్మారెడ్డి, జి.వెంకటాంపల్లి, పెద్దవడుగూరు మండలం

సర్వే చేసి హద్దులు చూపించారు



మా భూమిలో అన్నదమ్ములము భాగాలు పోయాం. నా భాగంగా 4.33 ఎకరాలు వచ్చింది. రీ-సర్వే ద్వారా మా పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించారు. నాకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సర్వే చేయడమే కాకుండా ఉచితంగా హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తుండడం చాలా సంతోషంగా ఉంది.

– దొక్కా రామచంద్ర, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

ప్రతిష్టాత్మకంగా రీ-సర్వే



సమగ్ర రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నాము. 464 మంది గ్రామ సర్వేయర్లు, 35 మంది మండల సర్వేయర్లు పనిచేస్తున్నారు. మూడు విడతల్లో 200 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. నాల్గో విడత కింద 120 గ్రామాల్లో చేపట్టాం. స్వామిత్వ కింద 18 గ్రామాల్లోని గ్రామకంఠాల్లోని నివాస ప్రాంత సర్వే పూర్తయ్యింది.

– రూప్లానాయక్, ఏడీ, సర్వే భూరికార్డుల శాఖ

పకడ్బందీగా రీ-సర్వే



జిల్లాలో ఆధునిక పరికరాలతో అత్యంత పకడ్బందీగా రీ-సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు చేపట్టిన మూడు విడతల్లో 200 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. ఈ గ్రామాల్లో 1.82 లక్షల ఎల్‌పీఎంలు తయారు చేయడంతో పాటు 5.88 లక్షల ఎకరాలు సర్వే చేశారు. నాల్గవ విడతలో చేపట్టిన గ్రామాల్లో సర్వే వేగవంతం చేస్తున్నాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

హత్య కేసులో నలుగురికి యావజ్జీవం



అనంతపురం: హత్య కేసులో నలుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాలాకుల ఆదినారాయణ కుటుంబం 2018 ఫిబ్రవరి 11న పొరుగున ఉన్న పెద్దనాన్న కుళ్లాయప్ప కుటుంబంతో మురికి నీటి కాలువ, ఇంటిముందు పేడ అలికే విషయమై గొడవపడింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన కుళ్లాయప్ప కొడుకులు పాలాకుల సూర్యనారాయణ, పాలాకుల పెద్దన్న, పాలాకుల రామాంజనేయులు, కూతురు కొండాపురం రామాంజినమ్మ కట్టెలు, కొడవండ్లతో విరుచుకుపడ్డారు. ఆదినారాయణ తమ్ముడు చిన్న చౌడప్పను గొంతుకోసి చంపారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై శింగనమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాస్ 10 మంది సాక్షులను విచారించారు. హత్యానేరం రుజువు కావడంతో పాలాకుల సూర్యనారాయణ (ఏ1), పాలాకుల పెద్దన్న (ఏ2), పాలాకుల రామాంజినేయులు (ఏ3), కొండాపురం రామాంజినమ్మ (ఏ5)లకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.42 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఏ4 అయిన కుళ్లాయప్ప భార్య సాలమ్మపై నేరం రుజువు కానందున ఆమెపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథరెడ్డి వాదించారు. ముద్దాయిలకు శిక్షపడేలా వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

పలువురు ఎస్ఐల బదిలీ

అనంతపురం క్రైం: జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ బదిలీలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతపురం నుంచి ఎస్ఐలు ఎ.విజయభాస్కర్‌రాజు, ఎం.జావీద్‌బాషా, జి.సాయినాథ్ ప్రసాద్, సి.భాస్కర్, కె.జయరామ్‌నాయక్, బి.వెంకటరమణ, పి.విజయభాస్కర్‌నాయుడు, టి.శివప్రసాద్, జి.శ్రీరామప్రసాద్, పి.మురహరి బాబు, కె.స్వర్ణతేజ, కె.శ్రీకాంత్, కె.నాగమాణిక్యం, ఎస్.మసూద్‌వలి, డి.బాలరాజు, ఎ.నాగరాజు, ఎం.అల్లాబకాష్, ఇ.ఎర్రిస్వామి, డి.చంద్రశేఖర్‌ను తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

నేడు గుంతకల్లులో 'సాధికార' బస్సుయాత్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర మంగళవారం గుంతకల్లులో జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని మెయిన్ రోడ్డు వైఎస్సార్ సర్కిల్‌లో సభ జరగనుంది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సభాస్థలితో పాటు ప్రధాన రహదారులన్నీ వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలతో కళకళలాడుతున్నాయి. జగన్ పాలనలో బడుగు, బలహీనవర్గాలకు చేకూరిన ప్రయోజనాలను వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలన్న లక్ష్యంతో బస్సు యాత్ర సాగుతోంది. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్, మాజీ మంత్రులు శంకరనారాయణ, అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీలు రంగయ్య, నందిగం సురేష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో పాటు సినీనటుడు, ఏపీ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ హాజరు కానున్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

గుంతకల్లులో మంగళవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు నియోజకవర్గం నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ముస్లిం మైనార్టీలతో పాటు వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన సంక్షేమ రథసారథి జగనన్నేనని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో- ఆప్షన్ సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పోలీసులపై 'ఎల్లో' విషం

- పాల్తూరు పోలీసులపై తప్పుడు రాతలు
- ఓ వ్యక్తిని బట్టలూడదీసి కొట్టారంటూ దుష్ప్రచారం
- వాస్తవాలు తెలుసుకోకుండా 'ఎక్స్' వేదికగా నారా లోకేష్ ట్వీట్
- ఎల్లోమీడియా, లోకేష్ తీరును తప్పుబట్టిన అదనపు ఎస్పీ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి



తాగిన మైకంలో చొక్కా విప్పి పోలీసుస్టేషన్‌లో అరాచకం చేస్తున్న చంద్రమోహన్

అనంతపురం క్రైం: విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన చంద్రమోహన్ అనే వ్యక్తిని పోలీసులు బట్టలూడదీసి నగ్నంగా ఊరేగించారంటూ ఎల్లోమీడియా రాసిన కథనాలను 'అనంత' పోలీసులు ఖండించారు. ఈ విషయంలో నారా లోకేష్ కూడా వాస్తవాలు తెలుసుకోకుండా 'ఎక్స్'లో ట్వీట్ చేయడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ తిప్పేనాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారు తెలిపిన మేరకు.. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ రాత్రి తాగిన మైకంలో మహేష్ అనే వ్యక్తితో చంద్రమోహన్ గొడవ పడ్డాడు. ఈ విషయంపై మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు చంద్రమోహన్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే తాగి ఉన్న చంద్రమోహన్ పోలీసు స్టేషన్‌లో అరాచకం చేశాడు. పోలీసులను ఎదిరిస్తూ చొక్కా విప్పేసి చిందులేశాడు. ఎంత చెప్పినా తీరు మార్చుకోకపోగా..సర్దిచెప్పేందుకు వెళ్లిన తన చిన్నాన్నపైనా దాడి చేయబోయాడు. స్టేషన్‌లో చొక్కా తీసేసి బయటకు వచ్చిన చంద్రమోహన్ స్టేషన్ ఆవరణలో అడ్డగించిన కానిస్టేబుల్ బి.రాజప్పపై రాయితో దాడి చేశాడు. లుంగీ కూడా ఊడదీసుకున్నాడు. బంధువులు చంద్రా, నాగేశ్వరరావుతో పాటు ప్రభాకర్ అనే స్థానికుడు అతనికి సర్దిచెప్పి లుంగీ కట్టుకోవాలని చెబుతున్న మాటలు కూడా వీడియోలో రికార్డయ్యాయి. చంద్రమోహన్ చేతిలో గాయపడిన కానిస్టేబుల్ అదే రోజు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. చంద్రమోహన్‌పై గతంలోనూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మొదట్నుంచీ తన వైఖరి విచిత్రమైనదన్న విషయం ఆ గ్రామంలో ఎవరిని అడిగినా చెబుతారు.

పోలీసుల వద్ద పక్కా ఆధారాలు

పాల్తూరు పోలీసులు చంద్రమోహన్‌పై దాడి చేసి నగ్నంగా ఊరేగించారంటూ ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాసింది. అదే నిజమనుకుని టీడీపీ నేత నారా లోకేష్ కూడా 'ఎక్స్' వేదికగా పోలీసులపై ట్వీట్ పెట్టారు. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్.. ఈ అంశంపై దర్యాప్తు అధికారిగా గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పను నియమించారు. ఈ కేసుకు సంబంధించిన ప్రతి విషయం తన ముందుంచాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో లోతుగా దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ నరసింగప్ప... చంద్రమోహన్‌ను స్టేషన్‌కు పిలిపించిన సమయం నుంచి అతను స్టేషన్ ఆవరణలో పోలీసులపై దాడి చేసి గాయపరిచేదాకా జరిగిన ప్రతి అంశంపై ఆధారాలను సేకరించారు. ఎల్లోమీడియాలో వచ్చిన అంశాలను ఖండిస్తూ పోలీసులు తగిన ఆధారాలను మీడియా ముందుంచారు. స్టేషన్‌లో చంద్రమోహన్ అరవడం, చొక్కా తీసేయడం, తన చిన్నాన్న, మిత్రుడిపై దాడి చేయబోయిన దృశ్యాలను పోలీసులు మీడియాకు చూపించారు. గ్రామంలో చంద్రమోహన్‌కు చాలా మందితో గొడవలు ఉన్నాయి. ఇన్ని వివాదాలున్న వ్యక్తి వ్యవహారం, చేసిన తప్పులను చూడకుండా ఏకపక్షంగా పాల్తూరు పోలీసులపై అభియోగాలు మోపారని ఏఎస్పీ తెలిపారు. పోలీసులపై ఇలాంటి విషప్రచారాలను చేసేవారు కొంత ఆలోచించాలని హితవు పలికారు. ఇలాంటి కథనాలు రాసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యకు పరిష్కారం ఉండాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకర్ ప్రజల నుంచి 450 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడి క్షుణ్ణంగా సమస్య తెలుసుకున్నపుడే సరైన పరిష్కారం చూపించడానికి వీలవుతుందన్నారు. సమస్యను పరిష్కరించిన తరువాత అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వడంతో పాటు వారి సంతకం తీసుకోవాలని సూచించారు.

వినతులు కొన్ని...

- రీ-సర్వేలో తక్కువ భూమి చూపించారని అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 303లో 4.16 ఎకరాలు తమ అనుభవంలో ఉంటే... రీ-సర్వే చేసి 3.16 ఎకరాలు మాత్రమే చూపించారని తెలిపారు. విచారణ చేయించి డాక్యుమెంట్ ప్రకారం కొలతలు వేయించి హద్దులు చూపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని నగర పరిధిలోని మున్నానగర్‌కు చెందిన నరేష్ ఫిర్యాదు చేశారు. తన తండ్రి బయన్న అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లిలోని ఎఫ్‌సీఐ గోదాములో హమాలీగా పనిచేస్తూ 2006లో అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. అటు తరువాత తల్లికూడా చనిపోవడంతో తాను అనాథగా మారానన్నాడు. కారుణ్య నియామకం కింద మా తండ్రి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వడం లేదని గుంతకల్లు పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న క్రిష్టయ్య ఫిర్యాదు చేశారు. వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యం గ్రామం సర్వే నంబరు 39-సిలో తమకు 4.60 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చిందని తెలిపారు. భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయించి పట్టదారు పాసుపుస్తకం వచ్చేలా చూడాలని కోరారు.

క్లుప్తంగా

జిల్లా వాసులకు ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు


జి. నందిత

అనంతపురం: జిల్లా వాసులకు జాతీయ సేవా పథకం రాష్ట్ర స్థాయి ఉత్తమ వలెంటీర్ అవార్డులు దక్కాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని జి.నందిత, జేఎన్‌టీయూ(ఏ)పరిధిలోని రైపర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యూనిట్-1 బి.నాగ శుభ, కడపలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి డి.సంతోష్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె.సురేష్‌బాబు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 12న విజయవాడలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురం సిటీ: నిర్మాణ రంగంలో నిరుద్యోగులకు ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ సోమవారం తెలిపారు. ప్లాస్టరింగ్, సిరామిక్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బిల్డింగ్ వంటి టెక్నాలజీస్‌పై ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఎనిమిది ఆపై తరగతులు చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. భవన నిర్మాణ రంగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి అన్నారు. ఎంపికైన వారికి వసతి, వెళ్లేందుకు ప్రయాణ ఖర్చు, ట్యాక్స్ డిడెక్షన్ వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 99888 53335 (టోల్‌ఫ్రీ)లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

బత్తలపల్లి: బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ- వైకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుదర్శన్‌రాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.... అభ్యర్థులు తప్పనిసరిగా నర్సింగ్ డిగ్రీ పూర్తి చేసి 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. జర్మనీలో పని చేసేందుకు సుముఖంగా ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భాషా డోమెన్ వంటి ఇతర నైపుణ్యాలపై జేఎన్‌టీయూ (కాకినాడ)లో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు మరింత సమాచారానికి 77021 00238, 91823 16114లో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ వెంకటరమణ తెలిపిన మేరకు.. ఉప్పరహాళ్ క్రాస్ వద్ద సోమవారం ఉదయం తనిఖీలు చేపట్టినప్పుడు బొలెరో వాహనంలో 80 బస్తాల్లో 42 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్న దర్గాహొన్నూరు గ్రామానికి యల్లప్ప, బొలెరో డ్రైవర్ రుద్రప్పపై కేసు నమోదు చేశారు.

మారనున్న 'అగ్రి' డివిజన్లు

- ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకూ 11 వ్యవసాయ సబ్‌డివిజన్లు
- కొత్తగా మరో మూడు చేరిక
- గుత్తి సబ్ డివిజన్ గుంతకల్లుకు మార్పు
- అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లాలో 416 ఆర్‌బీకేలు



వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: పాలనాపరమైన సౌలభ్యం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసిన నేపథ్యంలో వ్యవసాయశాఖ సబ్‌డివిజన్లనూ శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వం, వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అధికారులు ఆ దిశగా సన్నాహక చర్యలు చేపట్టారు. జిల్లా విభజనలో భాగంగా 63 మండలాలను 'అనంత' పరిధిలో 31, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి 32 మండలాలను చేర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 416 ఆర్‌బీకేలు గ్రామస్థాయిలోనే రైతులకు విశిష్ట సేవలందిస్తున్నాయి.

ఇప్పటికే 11 సబ్‌డివిజన్లు..

అనంతపురం జిల్లా పరిధిలో అనంతపురం, తాడిపత్రి, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం కలిపి ఆరు వ్యవసాయ సబ్‌డివిజన్లు ఉండగా... శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర మొత్తం ఐదు సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకూ 11 వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో పర్యవేక్షణకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) స్థాయి అధికారి ఉంటారు. ఇందులో అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఆరు మండలాలు, గుత్తి డివిజన్‌లో ఐదు మండలాలు, కళ్యాణదుర్గం డివిజన్‌లో ఆరు మండలాలు, రాయదుర్గం డివిజన్‌లో ఐదు మండలాలు, తాడిపత్రి డివిజన్‌లో ఐదు మండలాలు, ఉరవకొండ సబ్ డివిజన్ పరిధిలో నాలుగు మండలాలు, ధర్మవరం సబ్ డివిజన్ కింద ఆరు మండలాలు, హిందూపురం డివిజన్‌లో ఐదు మండలాలు, కదిరి డివిజన్‌లో అత్యధికంగా 10 మండలాలు, మడకశిర డివిజన్‌లో ఐదు మండలాలు, పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి.

నియోజకవర్గం ప్రాతిపదికగా విభజన..

పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు తాజాగా నియోజకవర్గ కేంద్రం ప్రాతిపదికగా వ్యవసాయ సబ్‌డివిజన్ ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. గతంలో ఒక నియోజకవర్గంలో ఉన్న ఒకట్రెండు మండలాలు మరో సబ్ డివిజన్‌కు చెందిన నియోజకవర్గ పరిధిలో ఉన్నందున రైతులకు, అధికారులకు కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఉదాహరణకు గుత్తి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని శింగనమల మండలం, అనంతపురం డివిజన్ పరిధిలోకి రాప్తాడు, కూడేరు మండలాలు, పెనుకొండ డివిజన్ పరిధిలోకి పుట్టపర్తి మండలం ఇలా... కొన్ని మండలాలు అటుఇటుగా ఉండడంతో ప్రోటోకాల్, ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో కొత్తగా మూడు సబ్‌డివిజన్లు చేరి మొత్తంగా 14 సబ్‌డివిజన్లు కానున్నాయి. కొత్తగా శింగనమల, రాప్తాడు, పుట్టపర్తి వ్యవసాయ సబ్‌డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. అలాగే గుత్తిలో ఉన్న సబ్ డివిజన్ కార్యాలయాన్ని గుంతకల్లుకు మార్పు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ కేంద్రం శింగనమలలో కాకుండా అందరికీ అందుబాటులో ఉండేలా డివిజన్ కార్యాలయాన్ని నార్పలలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ఆయా నియోజక వర్గ ప్రజాప్రతినిధులు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

భూసార సంరక్షణ కేంద్రాలూ కుదింపు..

ఉమ్మడి జిల్లా పరిధిలో అనంతపురం, కళ్యాణదుర్గం , హిందూపురం, కదిరిలో వ్యవసాయశాఖ అనుబంధంగా భూసార సంరక్షణ కేంద్రాలు (సాయిల్ కన్సర్వేషన్ సెంటర్లు) పనిచేస్తున్నాయి. ఇందులో ప్రస్తుతం రెండు అనంతపురం, మరో రెండు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లాయి. జిల్లాకు ఒకటి చొప్పున సంరక్షణా కేంద్రాలు ఉంచాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. నాలుగింటిలో రెండు కేంద్రాలను మూసివేయాలని ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. అక్కడ పనిచేస్తున్న ఏడీఏ స్థాయి అధికారులు, సిబ్బందిని... నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు కానున్న సబ్ డివిజన్ కేంద్రాలు లేదా డీఏఓ కార్యాలయానికి అటాచ్ చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

జన్‌భాగీదారి నిర్వహణ కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో జన్‌భాగీదారి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో జన్‌భాగీదారి కార్యక్రమాల నిర్వహణకు కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాస్థాయి కమిటీకి చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా జిల్లా పంచాయతీ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, డీఆర్‌డీఏ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి ఉంటారు. మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా రోజువారీగా జన్‌భాగీదారి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు తెలుగు భాషా వైభవ సదస్సు

- సాహితీమూర్తులకు పురస్కారాల ప్రదానం
- సాహితీ వేత్తలు, అభిమానులు తరలిరావాలి
- అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు


మాట్లాడుతున్న విజయబాబు, పీడీ నరసింహారెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్ / కల్చరల్: సాహిత్యానికి చరిత్రాత్మక ప్రదేశం ఉమ్మడి అనంతపురం జిల్లా అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఆడిటోరియంలో 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు జరగనుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన తెలుగు సాహితీ మూర్తులను విశిష్టస్థాయిలో పురస్కారాలు అందించి సత్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను విజయబాబు సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మీడియాకు వెల్లడించారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు తెలుగు భాషా వైభవ సదస్సు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పది మందికి జీవిత సాఫల్య సాహితీ పురస్కారాలు, మరో 40 మందికి తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. జిల్లా సంస్కృతిని చాటే కళారూపాల ప్రదర్శన, సాంస్కృతిక సంబరాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా సీమ ఖ్యాతిని చాటే శ్రీకృష్ణదేవరాయలు వైభవాన్ని చాటే కళా రూపాన్ని సినీనటుడు కౌశిక్ బృందం ప్రదర్శిస్తుందన్నారు. భాషాభిమానులు, విద్యార్థులు, సాహితీవేత్తలు అందరూ తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఇటువంటి మంచి కార్యక్రమాన్ని కూడా కొందరు తప్పు పడుతూ రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీ రంగానికి సేవ చేసిన వారిలో ఎవరినీ విస్మరించడం లేదని, ఇప్పుడు అవకాశం రాని వారికి త్వరలో రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హులైన వారందరినీ గుర్తించి సత్కరించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికార భాషా సంఘం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తోందన్నారు. జిల్లా టూరిజం శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భాషా, సాంస్కృతిక సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

'పోలీసు స్పందన'కు 179 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 179 వినతులు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. పోలీసు స్పందనకు రాలేని వారు నేరుగా 93929 26803 నంబరుకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

భార్యను వదిలి మరో యువతిని పెళ్లాడాడు

'నా భర్త నన్ను హింసించి...ఇబ్బందులు పెట్టి... పుట్టింట్లో వదిలేసి.. మరో యువతిని పెళ్లాడాడు. నాకు న్యాయం చేయండి' అంటూ ఎస్పీ అన్బురాజన్ ఎదుట ఓ వివాహిత వాపోయింది. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్పీకి వినతి పత్రం అందజేసి, మాట్లాడింది. కూడేరు మండలం కడదరకుంటకు చెందిన సుకన్యకు తన మేనత్త కుమారుడు రామాంజినేయులుతో మూడేళ్ల క్రితం పెద్దలు పెళ్లి చేశారు. పెళ్లైన ఆరునెలలకే అదనపు కట్నం కోసం తనను హింసించి పుట్టింటికి తరిమేశారని, ఈ లోపు మరో అమ్మాయితో పెళ్లి జరిపించేశారని వాపోయింది. సమస్య విన్న ఎస్పీ ఆమెకు న్యాయం చేస్తామని భరోసానిచ్చి పంపారు.

సరి'కొత్త' పాలన



అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) నూతన పాలక భవనాన్ని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ శనివారం వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం నుంచి పాలన వ్యవహారాలు నూతన భవనం నుంచే వర్సిటీ అధికారులు చేపట్టారు. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ఫర్నీచర్ మొత్తం మార్చారు. వీసీతో పాటు రెక్టార్, రిజిస్ట్రార్ పాలన బాధ్యతలు కొత్త భవనం నుంచే నిర్వర్తిస్తున్నారు. రాయలసీమకే తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లో రూ. 36.77 కోట్ల వ్యయంతో ఇటీవల నూతన పాలక భవనాన్ని నిర్మించారు. మొత్తం 11 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో పాలక భవనం అందుబాటులోకి వచ్చింది.

16 సంవత్సరాల అనంతరం పాలక భవనం: జేఎన్‌టీయూ (ఏ) 2008లో ఏర్పాటైంది. అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జేఎన్‌టీయూ (ఏ) వర్సిటీని ఏర్పాటు చేశారు. వర్సిటీ ఏర్పడిన తొలినాళ్లలో అల్యూమ్ని గెస్ట్ హౌస్ (పూర్వ విద్యార్థుల అతిథి గృహం)లో పరిపాలన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ భవనంలోకి మార్పు చేశారు. అప్పటి నుంచి అదే భవనం నుంచే పాలనా వ్యవహారాలు చక్కబెడుతూ వచ్చారు. అన్ని కార్యాలయాలు ఇదే భవనంలోనే ఏర్పాటయ్యాయి. తాజాగా నూతన పాలక భవనం అందుబాటులోకి రావడంతో కళాశాల ఓ క్యాంపస్‌లో, పాలక భవనంలో మరో క్యాంపస్‌లో వేర్వేరుగా ఉన్నాయి. కళాశాల క్యాంపస్‌లో ఉండే ఎంబీఏ కళాశాలను నూతన పాలక భవనం వెనుక వైపు ఉండే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోకి మార్పు చేయనున్నారు. ప్రస్తుతం ఈ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఉండే భవనంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పరిపాలన కార్యాలయం ఉంది. దీనిని ఈ ఏడాది ఏప్రిల్‌లోపు జంతలూరు వద్ద ఉన్న శాశ్వత క్యాంపస్‌లోకి మార్పు చేయనున్నారు. అనంతరం మేనేజ్‌మెంట్ ఆఫ్ బిజినెస్ స్కూల్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలోకి మార్పు చేస్తారు.

వివాహిత బలవన్మరణం


ఆదిలక్ష్మి (ఫైల్)

గుంతకల్లు రూరల్: సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని వాల్మీకి నగర్‌కు చెందిన రాజుకు ఏడేళ్ల క్రితం ఆదిలక్ష్మి (24)తో వివాహమైంది. మొబైల్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి జరిగి ఏడేళ్లైనా పిల్లలు కలగక పోవడంతో ఆదిలక్ష్మి మనోవేదనకు లోనైంది. ఈ క్రమంలో ఇరుగుపొరుగు వారు, బంధువులు అనుకునే మాటలు విని మనస్తాపం చెందిన ఆమె సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంటికి చేరుకున్న రాజు... ఉరికి వేలాడుతున్న తన భార్యను గమనించి చుట్టుపక్కల వారి సాయంతో వెంటనే కిందకు దించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కసాపురం ఎస్‌ఐ దుగ్గిరాజు మాట్లాడుతూ... ఆదిలక్ష్మి కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని పేర్కొన్నారు. ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామన్నారు.

బైకు అపహరణ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కళ్యాణదుర్గం: ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ తీర్పు వెలువరించారు. వివరాలు.. గత ఏడాది జనవరి 24న కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రామాంజినేయులు తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స అనంతరం బయటకు వచ్చేలోపు ఆయన ద్విచక్ర వాహనాన్ని దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏడాది తర్వాత పక్కా ఆధారాలతో అనంతపురానికి చెందిన సద్దాం హుస్సేన్, గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాంకు చెందిన బలిజ రాజశేఖర్‌ను నిందితులుగా గుర్తించారు. అప్పటికే వీరు మరో కేసులో జైలులో ఉండడంతో పీటీ వారెంట్‌తో అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తాడిపత్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని పట్టాలపై 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు తాడిపత్రి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

జన నినాదం 'క్విట్ ఎల్లో బ్యాచ్'

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: క్విట్ ఎల్లో బ్యాచ్ అనేది జనం నినాదమైందని, ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. గత ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోలో 600 హామీలను ప్రకటించిన చంద్రబాబు అందులో ఏ ఒక్క హామీనూ నెరవేర్చకపోవడంతో పాటు పార్టీ వెబ్‌సైట్ నుంచి ఆ మేనిఫెస్టోను మాయం చేశారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన సంస్కరణలన్నీ రానున్న కాలంలో సమస్యలు లేని సమాజం ఏర్పాటుకు దోహదపడతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఉరవకొండలో ఈ నెల 7న జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం అయితే, ఆ యాత్రకు ప్రజలు రాలేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు


వెబెక్స్‌లో మాట్లాడుతున్న ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మెజార్టీ పోలింగ్‌స్టేషన్లు ప్రభుత్వ స్కూళ్లలోనే ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద అన్ని స్కూళ్లల్లోనూ మౌలిక వసతులు కల్పించారు. అయితే పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే 145 స్కూళ్లలో వసతుల లోపం ఉన్నట్లు రాష్ట్ర అధికారుల నుంచి సమగ్ర శిక్ష కార్యాలయానికి జాబితా అందింది. దీని ఆధారంగా సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ప్రత్యేక దృష్టి సారించి ఆగమేఘాలపై మరమ్మతులకు ఆదేశించారు. సోమవారం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వెబెక్స్ ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఎస్‌ఎంఎఫ్ నుంచి నిధులు వినియోగించుకుని మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. ర్యాంపులకు అవసరమైతే ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు వేయించుకుని వెంటనే పనులు చేపట్టాలన్నారు. మరుగుదొడ్ల రిపేరీలపై దృష్టి సారించాలన్నారు. దాదాపు స్కూళ్లలో తాగునీటి వసతి ఉందన్నారు. ఈ పనులు పూర్తి చేసి ఫొటోలను కార్యాలయ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

జనవాక్కు

లక్షాధికారిని చేశారు



కూలి పనికి పోతే తప్ప పూట గడవదు. భర్త వదిలేసి పోయాడు. ఓ కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లోనే కాలం నెట్టుకొస్తున్నాం. కొడుకు బేల్దారి పనికి వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకుని వస్తే ఆ పూట గడుస్తుంది. పెద్దమ్మాయికి మాటలు రావు. మతిస్థిమితం లేదు. చిన్నమ్మాయికి పెళ్లి చేశా. కొడుకు కూడా పెళ్లి చేసుకుని వేరు కాపురం పెట్టాడు. దీంతో పెద్దమ్మాయి బాగోగులు చూడాల్సిన బాధ్యత నాపై పడింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత మా బతుకులు బాగుపడ్డాయి. పండమేటిరాయుడి ఆలయ సమీపంలో నా పేరుతో స్థలం మంజూరు చేసి, ఇల్లు కట్టిస్తున్నారు. ఇప్పుడా ఇల్లు రూ.10 లక్షలు విలువ చేస్తుంది. నన్ను లక్షాధికారిని చేశారు. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎంతో రుణపడి ఉన్నాం.

– పామల్ల సంజమ్మ, రాప్తాడు

కొడుకును ఇంజినీర్ చేశా..



మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. పిల్లలను ఉన్నత చదువులు చెప్పించాలంటే మా ఆర్థిక పరిస్థితి సరిపోదు. ఇలాంటి పరిస్థితిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దీవెన పథకాలతో మా కుమారుడు దామోదర్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. జగనన్నే కనుక సాయం అందించకపోతే నాలాగే నా కుమారుడు కూడా కూలి పనులతో జీవనం సాగించాల్సి వచ్చేది. ఈ రోజు వాడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడంటే అదంతా జగనన్న చలువే. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 వస్తోంది. ఎలాంటి సిఫారసు లేకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి దగ్గరకే అందుతున్నాయి. ప్రభుత్వం మారితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. అందుకే ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌నే ఎన్నుకోవాలి.

– చిన్న ఓబిరెడ్డి, గొందిరెడ్డిపల్లి, రాప్తాడు మండలం

'మార్కెటింగ్' దూకుడు

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశించుకున్న లక్ష్యసాధన దిశగా మార్కెటింగ్‌శాఖ దూకుడు సాగిస్తోంది. డిసెంబర్ నెలాఖరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 16 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది వివిధ రూపాల్లో రూ.10.81 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించుకోగా... 9 నెలలు ముగిసేసరికి 72 శాతంతో రూ.7.75 కోట్ల వసూళ్లతో ప్రగతి పథంలో దూసుకెళుతోంది. రూ.75 లక్షల టార్గెట్‌ను శింగనమల మార్కెట్ యార్డు పూర్తి చేసింది. అలాగే అనంతపురం మార్కెట్ యార్డు లక్ష్యం రూ.4.10 కోట్లు కాగా 84 శాతంతో ఇప్పటికే రూ.3.42 కోట్లు వసూళ్లు చేసి వంద శాతం దిశగా పయనం సాగిస్తోంది. తాడిపత్రి 75 శాతం, ఉరవకొండ 70 శాతం, రాప్తాడు 60 శాతం, రాయదుర్గం 55 శాతం, కళ్యాణదుర్గం 53 శాతం వసూళ్లు సాధించాయి. 40 శాతం వసూళ్లతో గుత్తి, గుంతకల్లు వెనుకంజలో పయనిస్తున్నాయి. ఈ రెండు కమిటీలు మొదటి నుంచి లక్ష్యానికి ఆమడదూరంలో నడుస్తుండడం గమనార్హం.

13 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు


అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కోవిడ్ లక్షణాలతో ఓపీకి వచ్చిన 13 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షలు చేయించుకున్న వారికి కోవిడ్ నిర్ధారణ కాలేదని పేర్కొన్నారు.

'మచ్చా' మెరుపు సెంచరీ


మచ్చా దత్తారెడ్డి

అనంతపురం: వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్ రాజరారెడ్డి క్రికెట్ స్టేడియం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-23 అంతర్రాష్ట్ర క్రికెట్ మల్టీడే క్రికెట్ టోర్నీలో అనంతపురానికి చెందిన బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి మెరుపు వేగంతో సెంచరీ సాధించారు. ఆంధ్రప్రదేశ్, గోవా జట్ల మధ్య రెండో రోజు మ్యాచ్ సోమవారం జరిగింది. ఏపీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మచ్చా దత్తారెడ్డి 86 బంతుల్లో ఏడు ఫోర్లు, ఏడు సిక్సర్లతో 102 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో గోవా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రా జట్టు 4 వికెట్లు కోల్పోయి 606 పరుగులకు డిక్లేర్ చేసింది. తొలి రోజు రేవంత్ రెడ్డి, వంశీ కృష్ణ చెరో సెంచరీలు చేయగా, రెండో రోజు మచ్చా దత్తారెడ్డి, హేమంత్ రెడ్డి సెంచరీలు సాధించడం గమనార్హం.

సౌత్‌జోన్ జట్టులో అనంత క్రికెటర్లు


తన్మయి కార్తీక్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సంజయ్

అనంతపురం: జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు అండర్-14 సౌత్‌జోన్ క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్నారు. గుంటూరులోని పేరేచర్లలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జట్టును ఎంపిక చేయగా నార్పలకు చెందిన కె.సంజయ్, అనంతపురానికి చెందిన తన్మయి కార్తీక్‌రెడ్డి, టి.కిరణ్‌కుమార్‌కు చోటు దక్కింది. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

మనసున్న మారాజు సీఎం జగన్

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


కనగానపల్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


దాదులూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

కనగానపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో మనసున్న మారాజులా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 8 గ్రామ సభలు నిర్వహించి, రూ.3 వేలకు పెంచిన 6,250 పాత పింఛన్లతో పాటు కొత్త మంజూరైన 350 పింఛన్ల డబ్బులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు, కులమతాలకతీతంగా అన్నివర్గాలకూ అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగకుండా గ్రామ వలంటీర్లు దరఖాస్తు చేయించి, అర్హులకు ప్రతి నెలా ఠంచనుగా 1వ తేదీ ఉదయాన డబ్బులు పంపిణీ చేయిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజవర్గంలో 49 వేల మందికి సామాజిక పింఛన్లు అందుతున్నాయన్నారు.

చంద్రబాబుది పేరు గొప్ప..ఊరు దిబ్బ:
40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు.. తన పాలనంతా పేరు గొప్ప.. ఊరు దిబ్బ రీతిలో ఉందని ఎమ్మెల్యే విమర్శించారు. ఆయన హయాంలో 600 అబద్ధపు హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, కొత్తగా రూ.3 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పు ఊబిలోకి నెట్టారన్నారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావటానికి 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ టీడీపీ నాయకులు ఇంటింటా తిరుగుతున్నారన్నారు. వాటిని నమ్మి ప్రజలు మోసపోరని, రాజకీయ పొత్తుల కోసం పాకులాడుతున్నారన్నారు. అయితే సీఎం జగన్ తన పాదయాత్రలో చెప్పిన నవరత్న పథకాల్లో వంద శాతం అమలు చేసి, పేదల ఖాతాల్లో రూ.2.45 లక్షల కోట్లు నేరుగా జమ చేశారన్నారు. మరో రూ.2.5 లక్షల కోట్లు ఇంటి స్థలాలు, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలకు ఖర్చు చేశారన్నారు.

పరిటాల కుటుంబం ప్రజలకు చేసింది శూన్యం:
రాప్తాడు ప్రాంతంలో 25 ఏళ్ల పాటు రాజకీయ పదవుల్లో ఉన్న పరిటాల కుటుంబం పేద ప్రజలకు శూన్యమని ఎమ్మెల్యే తెలిపారు. కానీ ప్రస్తుతం చేస్తున్న తాను అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక పరిటాల సునీత లేనిపోని, ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు పీఏబీఆర్ నీటి తరలింపునకు పైపులైన్లు ఏర్పాటు చేస్తుంటే, దాన్ని చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. దొంగతనాలు, ఫ్యాక్షన్ చరిత్ర పరిటాల కుటుంబ సభ్యులదైతే..తనకు గ్రామాల్లో ప్రశాంతత, పేదల సంక్షేమమే ముఖ్యమన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాతా పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకురావడంతోపాటు నియోజక వర్గంలోని అన్ని చెరువులు నింపి, అదనంగా 50 వేల ఎకరాలు సాగులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా రాప్తాడు నియోజకవర్గంలో రూ.2,800 కోట్లు ఖర్చు చేయటంతో పాటు 17 వేల మందికి ఇళ్లు, 2 వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, ఏసీఓ రాజేశ్వరరెడ్డి, గొర్రెల పెంపకం సహకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు నరసింహగౌడ్, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎంపీ పూజలు


ఎంపీ రంగయ్యకు తీర్థప్రసాదం అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అనంతపురం ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణదుర్గం వెళ్తూ మొదటి సారిగా అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఎంపీకి శాలువా కప్పి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బందూక మధు, తలారి సోము, నారాయణ, చిన్న ఆంజనేయులు, ప్రసాద్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు మారథాన్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో 'ఆడుదాం - ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు మారథాన్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మారథాన్ రన్ కార్యక్రమం జూనియర్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా కొనసాగి, ఆర్ట్స్ కళాశాల వద్ద ముగుస్తుందని కమిషనర్ తెలిపారు.

క్లుప్తంగా

గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండల పోలింగ్ స్టేషన్ అధికారి దామోదర్‌రెడ్డి,పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని సిద్దరాంపురం, పి.యాలేరు, వై.కొత్తపల్లి గ్రామ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా? లేదా అన్న విషయాలు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తలుపులు, షెడ్లు, దివ్యాంగులకు ర్యాంప్‌లు, బల్లలు పరిశీలించారు.

ప్రబోధానంద యోగీశ్వరుల కృషి ప్రశంసనీయం


భగవద్గీత ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

అనంతపురం కల్చరల్: త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారానికి విశేష కృషి చేస్తున్న ప్రబోధానంద సేవలు ప్రశంసనీయమని ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు అన్నారు. సోమవారం నగర శివారులోని పలు గ్రామాలు, నగరంలోని పలు వీధుల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం చేసి, సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మల్లికార్జున, రాజేష్, నాగమణి, సుధాకర్, సుంకిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ


క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసిన దృశ్యం

ఆత్మకూరు: ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల క్రికెట్ టీమ్‌కు సనప పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో క్రికెట్ టీమ్‌కు సనప ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నీలూరు రమణారెడ్డి టీషర్టులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ సుధా, పీడీ నాగరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత


హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహేశ్వరరెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

రామగిరి: మండలంలోని పోలేపల్లికి చెందిన మహేశ్వరరెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, వలంటీర్ ఆదినారాయణరెడ్డి అక్కడికెళ్లి సోమవారం పింఛన్ అందించాడు. మహేశ్వరరెడ్డి కొన్ని నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. వలంటీర్ హైదరాబాద్‌కు వచ్చి పింఛన్ అందజేయడం సంతోషంగా ఉందని పింఛన్‌దారు తెలిపాడు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తాడిపత్రి: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జీవీఎల్ శంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225856 నంబర్‌కు కాల్ చేసి సూచనలు, సలహాలు చెప్పాలన్నారు.

చేనేత వృత్తిపై అవగాహన అవసరం


ఇండస్ట్రియల్ విజిట్‌కు బయల్దేరుతున్న విద్యార్థులు

గార్లదిన్నె: ఒకేషనల్ విద్యార్థులు చేనేత వృత్తిపై అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. సోమవారం మోడల్ స్కూల్లో అమలవుతున్న ఒకేషనల్ కోర్సు అప్పెరల్ అండ్ మేడ్ అప్స్‌లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మర్తాడులో మగ్గాలను విద్యార్థులు పరిశీలించారు. మగ్గాల నిర్వాహణ, చేనేత వృత్తిపై ఉపాధ్యాయులుఉ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం జరుగుతుంది

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


కనగానపల్లిలో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, వారికి అన్ని రకాలుగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు కలిసి వారి డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లంటినీ పరిష్కరించే రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే కార్మిక సంఘాల నాయకులు వీటి గురించి ప్రభుత్వానికి నిశితంగా వివరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన సాగిస్తున్నారని, అంగన్‌వాడీలు సమ్మెను విరమించి విధుల్లో చేరితే తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కదిరప్ప, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సభ్యులు చాముండి, అనిత, వరలక్ష్మి, అమ్మాజాక్షి, భార్గవి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఈఈ సూర్యనారాయణను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో మేయర్ మాట్లాడారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వివిధ డివిజన్‌లో రూ.లక్షల అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అభివృద్ధిలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణరెడ్డి

కూడేరు: మండల స్థాయిలో ఈ నెల 10 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ నారాయణ రెడ్డి సూచించారు. పోటీలను విజయవంతం చేయాలంటూ సోమవారం కూడేరులో హైస్కూల్ విద్యార్థులతో కలసి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల స్థాయి క్రీడా పోటీలు దిగ్విజయంగా సాగేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి రఘు, హైస్కూల్, కేజీబీవీ పీడీలు అక్కులప్ప, నరసింహులు, అంజనాబాయి, రుక్మిణి, రిజ్వానా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రకరూరు: ఈనెల 10 నుంచి మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభిస్తామని ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 న గ్రామస్థాయిలో గెలుపొందిన జట్లకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

నిర్మాణ భవనంపై నుంచి పడి కూలీ మృతి

అనంతపురం క్రైం: స్థానిక గుత్తిరోడ్డులో నిర్మాణంలో ఉన్న వాసవీ అపార్ట్‌మెంట్‌లో కూలిగా పనిచేసే భీమల్ బేరా (51) ప్రమాదవశాత్తూ మొదటి అంతస్తు నుంచిపడి మృతిచెందాడు. పశ్చిమబెంగాల్‌లోని కమలాపురానికి చెందిన భీమల్ బేరా.. కుటుంబంతో కలిసి వలస అనంతపురానికి వచ్చాడు. స్థానిక కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తోటి కూలీలందరూ టీ తాగడానికి వెళ్లడంతో ఒక్కడే పని చేస్తున్నాడు. గోడ నుంచి మరో గోడపైకి దాటుతుండగా కాలుజారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే అతను మృతి చెందాడు. కూలీలు టీ తాగి వచ్చిన అనంతరం గుంతలో పడి ఉన్న భీమల్ బేరాను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఉచిత కంటి పరీక్షలు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసుశాఖ చొరవతో మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో 14 మందికి సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. నగరంలోని బుడ్డప్ప నగర్ షికారీలకు పరీక్షలు చేశారు. నలుగురికి శస్త్రచికిత్సలు అవసరమని, మిగిలిన వారికి కళ్లద్దాలు, మందులు మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఉచితంగా పంపిణీ చేయనున్నారు. పరివర్తన కార్యక్రమంలో భాగంగా షికారీల అభివృద్ధికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేక కృషి చేస్తున్నారు.

అయోధ్య అక్షింతలతో ర్యాలీ

పామిడి: పట్టణంలో సోమవారం అయోధ్య అక్షింతలతో రామ భక్తులు ర్యాలీ చేపట్టారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పామిడి ఖండ ఆధ్వర్యంలో పురవీధుల్లో భజన చేశారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేపట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు.

దిశ యాప్‌పై అవగాహన

నార్పల: దిశ యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో దిశ యాప్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేష్ పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11 మంది రౌడీషీటర్లను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వీరికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

పుట్లూరు: ఈవ్‌టీజింగ్ చేస్తే కటకటాలపాలు కావల్సిందేనని ఎస్ఐ దిలీప్‌కుమార్ అన్నారు. సోమ వారం శనగలగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు వచ్చే సమయంలో, బస్సులో ప్రయాణించే సమయంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట ఇచ్చాడు..శాశ్వత పరిష్కారం చూపాడు


ఆత్మకూరులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: మండల ప్రజలకు ఎన్నికల సమయంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట ఇచ్చారు.. ఇచ్చిన మాట ప్రకారమే రూ.36 కోట్లతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం ఆత్మకూరుకు 70 లారీల పైపులు వచ్చాయి. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు లారీలను బైపాస్ వద్ద ఆపి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యాం నుంచి 22 కిలో మీటర్ల మేర పైపులైన్ తీసుకొచ్చారన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. గతంలో ఎంతో మంది నేతలు ఒట్టిమాటలు చెప్పి, చేతులు దులుపుకున్నారని, ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. రైతులకు పేరూరుడ్యాం ద్వారా నీరు అందించి, మరో వైపు ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించారన్నారు.

ఆత్మకూరుకు మేలు జరగడం ఇష్టం లేదా?
పరిటాల సునీత అధికారంలో ఉన్నన్న రోజులు ఏనాడూ ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేయలేదు.. మండలంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తుంటే.. ఓర్వలేక విమర్శలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలు, ఎల్లో మీడియాలో రాసిన రాతలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మకూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.36 కోట్లతో పీఏబీఆర్ డ్యాం నుంచి 22 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయిస్తున్నారన్నారు. ఆత్మకూరుకు శ్రీకాళహస్తి నుంచి శ్రీ పైప్స్ , ఎలక్ట్రో స్టీల్ కంపెనీకి చెందిన 4 వేల పైపులు ఇక్కడికి తెస్తుంటే.. సునీత మాత్రం.. రాజధాని అమరావతి నుంచి రహస్యంగా తాగు నీటి పైపులను తరలిస్తున్నారని, అక్కడ రైతులు ఆందోళన చేస్తున్నారని అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. పైపులకు సంబంధించి ఇన్‌వాయిస్‌లు తప్పకుండా ఉంటాయన్నారు. సోమవారానికే 70 లారీల పైపులు వచ్చాయని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, ఏఈ హరికుమార్ శ్రీకాళహస్తికి వెళ్లి పైపుల నాణ్యతను పరిశీలించిన తర్వాతే ఇక్కడికి వస్తున్నాయన్నారు. నిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, అతిక్‌రెడ్డి, సద్దికూటి శివారెడ్డి, అంజినప్ప, పాలగిరి వెంకట్రామిరెడ్డి, నరేంద్ర రెడ్డి ,చిన్న కొండారెడ్డి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

ఆత్మకూరు: తలుపూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ బధిర ఉద్యోగుల అసోసియేషన్ రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను వికలాంగుల శాఖ ఏడీ సోమవారం ఆవిష్కరించారు. అనంతపురం ఆర్‌అండ్‌బీ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

సెయింట్ అగస్టీన్ విద్యార్థినులకు రాష్ట్ర స్థాయి అవార్డు


నాటక ప్రదర్శన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని సెయింట్ అగస్టీన్ పాఠశాల (చర్చిస్కూల్) విద్యార్థినులకు రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాల్లో ఈ స్కూల్ విద్యార్థినులు భావికాబ్లెస్సీ, ఋూన్సీ, సుస్మిత, ఆరీబ, షఫియాలు 'బాధ్యత' అనే నాటికను ప్రదర్శించారు. విద్యార్థినులను హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

10న ఉచిత వైద్యశిబిరం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబులంపల్లిలో ఈనెల 10న పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పాఠశాలలో నిర్వహించనున్న వైద్య శిబిరానికి ఆధార్ కార్డు సెల్‌ఫోన్ వెంట తీసుకురావాలన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు


భోగి మంట వెలిగిస్తున్న చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లలో ఉపాధ్యాయులు, విద్యా ర్థులు సోమ వారం ముందస్తు సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ఈ పండుగ ప్రత్యేకతను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు ఈ పండుగను సంబరంగా జరుపుకుంటారన్నారు. పాఠశాలల ఆవరణల్లో రంగురంగుల రంగవల్లులుతో అలంకరించారు. పిల్లల హరిదాసు వేషధారణలతో ఆకట్టుకున్నారు. గాలిపటాలు ఎగురవేస్తూ కోలాహలంగా సందడి చేశారు.

మొక్కల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోండి


రైతులతో కలిసి మామిడి తోటను సందర్శిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: రైతులు భూసార పరీక్షలు, నీటిపరీక్షల ఆధారంగా మామిడి తోటలను సాగు చేయాలని జిల్లా ఏడీహెచ్ నరశింహారావు, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో కరిడికొండ, ఊబిచెర్ల గ్రామ రైతులకు మామిడి తోటల సాగుపై ఉద్యానశాఖ-ఏపీఐఏటీపీ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మొక్కలను ఎన్నుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐర్నియర్ గ్రాస్టింగ్ పద్ధతిలో అంటు కట్టిన మొక్కలను ఎన్నుకోవాలన్నారు. గుంతలను మూడు అడుగుల లోతు తీయాలన్నారు. 100 కిలోల పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, వేపచెక్క వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మొగ్గ, పూత దశ, పచ్చి పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నెలసరి వారిగా రైతులు పాటించాల్సిన విషయాలను తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓ మిత్రవింత మాధవి, ఏఓ ముస్తాక్ అహ్మద్, అగ్రిబోర్డు అడ్వైజరీ బోర్డు చైర్మన్ రామ రంగారెడ్డి, వీఏఏ అజయ్, ఉప సర్పంచ్ ఆనంద రావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లి వద్ద సాగు చేసిన పప్పుశనగ పంటలో సోమవారం అధికారులు పంటకోత ప్రయోగం చేశారు. రైతు జగదీశ్వర్ నాయుడు పంటలో నిర్ధేశిత కొలతల్లో పంటను తొలగించి దిగుబడి లెక్కించారు. 450 గ్రాముల దిగుబడి వచ్చిందని ఏఓ ఆంజనేయులు తెలిపారు.

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం జాతీయ ఆహార భద్రత మిషన్ ఆధ్వర్యంలో కంది పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఏఓ ముస్తాక్ అహ్మద్ గ్రామ శివారులోని కంది పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కంది పంటలో ఆశించిన దిగుబడి రాలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మేలు రకం విత్తనాలను అందిస్తామని తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ తప్పకుండా చేయించుకోవాలని లేని పక్షంలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందవని అన్నారు.

'ఉపాధి' కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి

కూడేరు: ఉపాధి పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ నాగభూషణరెడ్డి సూచించారు. పనుల కల్పనపై సోమవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. రోజుకు సుమారు 500 మంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజినీర్ రవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.